సాక్షి సిద్దిపేట

ఆదివారం । 9 । జూన్ । 2024



పేదలకు సేవ చేయడమే..

పేదలకు సేవలందించడమే లక్ష్యంగా ఐవీఎఫ్ పని చేస్తుందని ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. వివరాలు 8లో ▸



వెంచర్‌లో గంజాయి..

జహీరాబాద్‌లో గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. వివరాలు 8లో ▸



సాగుకు సమాయత్తం

సకాలంలో రుతుపవనాలు రావడంతో రైతులు వానాకాలం పంటల సాగుకు సిద్ధమయ్యారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

యూనిఫాంలు సిద్ధం

- డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య



పోతారం(ఎస్) కుట్టుపనిని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే యూనిఫాంలను పూర్తి చేసిన మహిళా సంఘాల సభ్యులను డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య అభినందించారు. శనివారం పోతారం(ఎస్) స్త్రీశక్తి టైలరింగ్ యూనిట్‌ను సందర్శించి మహిళల కుట్టు పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ మండలంలో 923, అక్కన్నపేట మండలంలో 2,130మంది విద్యార్థుల దుస్తులను సకాలంలో కుట్టి ఎంఈఓలకు అందించారన్నారు. మహిళల పనితీరును మెచ్చుకుని నంగునూర్, చేర్యాల మండలాలకు చెందిన విద్యార్థుల యూనిఫాంలు కూడా వారికే అప్పగించి నట్టు చెప్పారు. హాస్టల్ విద్యార్థుల దుస్తులు కూడ వారికే ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఆయన వెంట డీపీఎం విద్యాసాగర్, ఏపీఎం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రాజీయే రాజమార్గం

- న్యాయమూర్తి సాయి రమాదేవి
- లోక్‌అదాలత్‌లో 8,723 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి

సిద్దిపేటకమాన్: రాజీయే రాజ మార్గమని.. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడానికి లోక్‌అదాలత్ సరైన వేదిక అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. రాజీ చేసుకోదలచిన పలు క్రిమినల్, వాహన ప్రమాద, గృహహింస, చెక్‌బౌన్స్, ప్రి లిటిగేషన్ కేసులను రాజీమార్గం ద్వారా న్యాయమూర్తులు పరిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. లోక్‌అదాలత్‌లో కేసు రాజీఅయితే మళ్లీ అప్పీలకు వెళ్లే అవకాశం ఉండదన్నారు. సంవత్సరాల తరబడి కోర్టు చుట్టూ తిరిగే బదులు ఒకేసారి లోక్ అదాలత్‌లో కేసును రాజీ చేసుకుంటే సమయం వృథా కాకుండా ఉంటుందని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో 4,884 క్రిమినల్ కేసులు, 28 సివిల్ కేసులతో పాటు మొత్తం 8,723 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తులు స్వాతిరెడ్డి, మిలింద్ కాంబ్లి, చందన, శ్రావణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు మంతూరి సత్యనారాయణ, వై.రాజేశ్వర్‌రెడ్డి, పత్రి ప్రకాశ్, లక్ష్మీనారాయణ, శివాజీ, మణి, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

11న ఉద్యాన యూనివర్సిటీ స్నాతకోత్సవం



మాట్లాడుతున్న వీసీ నీరజ

ములుగు(గజ్వేల్): మండల కేంద్రంలోని ఉద్యాన విశ్వ విద్యాలయంలో (ఎస్‌కేఎల్ టీఎస్‌హెచ్‌యూ) ఈ నెల 11న స్నాతకోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నీరజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 9.45 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గవర్నర్, యునివర్శిటీ చాన్స్‌లర్ రాధాకృష్ణన్‌తో పాటు తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ గీతాలక్ష్మి హాజరై అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేయనున్నట్లు వివరించారు. స్నాతకోత్సవానికి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వీసీ నీరజ పేర్కొన్నారు.


వైభవంగా చండీ యాగం

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలం బల్కంచెల్క తండాలో శనివారం దశమ మాసోత్సవ చండీ యాగం నిర్వహించారు. తండాలోని విశ్వపాలిని భవానీ సమేత సేవాలాల్ మహారాజ్ మందిరంలో ధర్మకర్త, మేడ్చల్ జిల్లా రవాణాశాఖ అధికారి మూడ్ కిషన్ లలిత దంపతుల ఆధ్వర్యంలో హోమం చేపట్టారు. టీవీ ఆర్టిస్టు, సిద్ధాంతి బ్రహ్మశ్రీ చంద్రమౌళీశ్వర శర్మ దంపతులు, ఔరంగాబాద్‌కు చెందిన వేదపండితులు అనూప్‌శర్మ, మందిరం ప్రధాన అర్చకులు మనోజ్‌శర్మ నేతృత్వంలో కార్యక్రమాలు నిర్వహించారు.

ఫీజులగలు!

ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచిన ప్రైవేట్ పాఠశాలలు

చదువు'కొనే'కాలమిది. జూన్ వచ్చిందంటే చాలు విద్యార్థుల తల్లిదండ్రుల్లో దడ మొదలవుతుంది. మరో రెండు రోజుల్లో బడిగంటలు మోగనుండటంతో వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజుల మోత మోగిస్తున్నాయి. ఎన్ని కష్టాలెదురైనా సరే.. తమ పిల్లలను బాగా చదివించాలని తల్లిదండ్రులు తపిస్తుంటారు. ఈ బలహీనతను ఆసరాగా చేసుకొని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు సొమ్ము చేసుకుంటున్నాయి. జలగల్లా పీల్చిపిప్పి చేస్తున్నాయి. కొత్త ప్రవేశాలు, డొనేషన్లు, నెలవారి ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, షూస్, బ్యాగులు, రవాణా ఇలా.. అనేక ఖర్చులు తలకు మించిన భారంగా మారింది. గతేడాదికంటే ఈసారి 20-30 శాతం ఫీజులు పెంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఫీజుల దోపిడీపై సాక్షి ప్రత్యేక కథనం. - సాక్షి సిద్దిపేట



- గతేడాది కంటే 20-30 శాతం అధికం
- విద్యార్థుల తల్లిదండ్రుల బలహీనతను సొమ్ము చేసుకుంటున్న వైనం
- చితికిపోతున్న మధ్య తరగతి కుటుంబాలు

▸ 8లో

నకిలీ విత్తనాలతో.. జరభద్రం



నెలాఖరు వరకు పత్తి విత్తుకోవచ్చు

- అందుబాటులో అన్ని రకాల విత్తనాలు, ఎరువులు
- యాజమాన్య పద్ధతులు పాటించాలి
- వరి కొయ్యలను కాల్చవద్దు, కలియదున్నాలి
- జిల్లా వ్యవసాయాధికారి మహేశ్

సాక్షి ఆధ్వర్యంలో ఫోన్ ఇన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దళారులు చెప్పే మాటలకు మోసపోవద్దని, నకిలీ విత్తనాల జోలికి పోవద్దని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మహేశ్ రైతులకు సూచించారు. వానాకాలం సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో 'సాక్షి'ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి గంట పాటు కొనసాగింది. అనేక మంది రైతులు ఫోన్ చేసి విత్తనాల ఎంపిక, నకిలీ విత్తనాలను గుర్తుపట్టడం, ఎరువుల యాజమాన్యం, పంట దిగుబడి, మొక్కజొన్న, కందుల సాగు, ప్రభుత్వ సహాయం, దొడ్డు, సన్నాల సాగు, తదితర అంశాలపై అడిగిన ప్రశ్నలకు ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు.

వరి, మొక్కజొన్న విత్తనాలకు సబ్సిడీ అందిస్తున్నారా?

- స్వామి, మల్లారెడ్డి, దుబ్బాక

☛ ప్రస్తుతం వరి, మొక్కజొన్న విత్తనాలకు ఎలాంటి సబ్సిడీ లేదు. ఎన్నికల కోడ్ కారణంగా ఇప్పటి వరకు జీలుగా విత్తనాలకు మాత్రమే సబ్సిడీపై ఇస్తున్నాం. ప్రభుత్వం ప్రకటించగానే రైతులకు సబ్సిడీ అందిస్తాం.

వెద సాగు ఏ విధంగా చేస్తే లాభదాయకంగా ఉంటుంది..?

తిరుపతి, సిద్దన్నపేట

☛ వెద సాగు పద్ధతిలో వరి పంటను సాగు చేయడంతో పంట పెట్టుబడి, సాగు సమయం తగ్గుతుంది. అందువల్ల స్వల్పకాలిక (125 రోజులు), మధ్యకాలిక (135 రోజులు) వంగడాలను సాగు చేయాలి. ప్రతి మంగళవారం గ్రామస్థాయిలో రైతువేదికలో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమంలో పూర్తి స్థాయి వివరాలు మండల వ్యవసాయశాఖ అధికారులు, ఏఈఓలు అందిస్తారు. అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలతో సాగును చేయడం ఉత్తమం.

సన్నాలా..? దొడ్డు రకాలా..?

ప్రస్తుతం వరిలో సన్నాలు సాగు చేయడం మేలా..? దొడ్డు రకాలు సాగు చేయడం లాభసాటిగా ఉంటుందా?

- నర్సారెడ్డి, లక్ష్మారెడ్డి, రఘోత్తంపల్లి

☛ సన్న రకాలు సాగుకు అధిక సమయం పడుతుంది. అలాగే.. దొడ్డు రకాల సాగుకు పంట సమయం తక్కువగా ఉంటుంది. మార్కెట్‌లో సన్న రకాలకు అధిక డిమాండ్ ఉంటుంది. కానీ సాగు కాలం అధికంగా ఉంటుంది. దొడ్డు రకాలు చీడల నుంచి రక్షించుకోవచ్చు. అందువల్ల ఏ రకాల సాగు చేసినా రైతులకు లాభసాటిగానే ఉంటుంది.

భూసార పరీక్షలు చేయడం ద్వారా రైతులకు ఏమైనా ఉపయోగం ఉంటుందా? ఎరువులు అందుబాటులో ఉన్నాయా?

- వేణుగోపాల్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, హుస్నాబాద్

☛ భూసార పరీక్షలు నిర్వహించడం వల్ల భూమిలో ఉండే లవణాల శాతం, ఏ పంటకు అనుకూలంగా ఉంటుందో, భూసారం కోసం ఏ ఎరువులు వాడాలో తదితర పూర్తి సమాచారం తెలుస్తుంది. అందువల్ల భూసార పరీక్షలతో రైతులకు అనేక విధాలుగా లబ్ధి చేకురుతుంది. జిల్లాలో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

వరిలో ఏ వంగడాన్ని ఎంచుకుంటే మంచిది, వరి కొయ్యలను కాల్చకుండా సేద్యం చేస్తే మంచిదా?

- రాంచంద్రం, దర్గపల్లి

☛ వరిలో మధ్య, స్వల్పకాలిక రకం వంగడాలను ఎంపిక చేసుకోవాలి. దీంతో పాటుగా సాగు సమయం తగ్గుతుంది, నీటి వినియోగం తగ్గుతుంది. వరి పంటను కోశాక కొయ్యలను తగులపెట్టడం వల్ల భూమిలో పంటలకు లాభం చేసే మిత్ర పురుగులు నశించిపోతాయి. అందువల్ల వరి కొయ్యలను నీరు పెట్టి కలియ దున్నడంతో భూమి సారవంతంగా తయారవుతుంది. వాతావరణ కాలుష్యం తగ్గుతుంది.



ఫోన్ ఇన్ కార్యక్రమంలో రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మహేశ్

జీలుగా విత్తనాల కొరత ఉంది, రైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోండి?

- అయిలయ్య, పాలమాకుల

☛ జిల్లాలో జీలుగా విత్తనాలు అందుబాటులోనే ఉన్నాయి. అయితే రైతులు అవసరానికి మించి కొనుగోలు చేస్తుండటంతో కృత్రిమ కొరత ఏర్పడుతుంది. ఒక్క బ్యాగుకు బదులుగా, రెండు నుంచి మూడు బ్యాగులు తీసుకోవడంతో మిగితా రైతులకు అందించడంలో ఇబ్బంది తలెత్తుతుంది. రైతులందరికి జీలుగా విత్తనాలు అందించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలి

పత్తి విత్తనాలు ఏ సమయం వరకు, ఎలాంటి విత్తనాలు విత్తాలి ?

- సత్యనారాయణ, తిమ్మాపూర్. శ్రీనివాస్, ఐనాపూర్

☛ పత్తిని ఈ నెల చివరి వరకు నాటుకోవచ్చు. భూమిలో 60 నుంచి 70మిల్లీమీటర్ల వరకు తడి ఉండాలి. ఇప్పుడు అన్ని రకాలుగా అనుకూలమైన వాతావరణం ఉంది. ఆకర్షణీయమైన ప్యాకెట్‌లలో, అధిక ధరలకు ఉన్న విత్తానాలే నాణ్యమైనవిగా రైతులు భావించి, సాగు చేసి నష్టపోతున్నారు. అందువల్ల లైసెన్స్ కలిగిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలి. గడువు సమయం, లాట్ నంబర్‌ను చూడాలి. తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. పంట సాగు పూర్తయ్యే వరకు బిల్లుతో పాటుగా, విత్తన ప్యాకెట్‌ను భద్రపర్చుకోవాలి. ఇది రైతులకు ఉపయోగపడుతుంది.

నేడు గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష

- జిల్లాలో 21 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- పరీక్ష రాయనున్న 8,239 మంది అభ్యర్థులు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

సిద్దిపేటరూరల్: జిల్లాలో టీజీపీఎస్‌సీ గ్రూప్ 1 పరీక్ష ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగనుంది. అభ్యర్థులు వారి వెంట మొబైల్‌ఫోన్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులు, షూస్ వంటివి సైతం అనుమతించరు. ఉదయం 8 గంటల వరకు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలి. ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు, హాల్‌టికెట్‌లను ఐడెంటిఫికేషన్ అధికారులు అభ్యర్థులు పరిశీలించి, 9 గంటల నుంచి లోపలికి అనుమతిస్తారు. 9.30 గంటల నుంచి బయోమెట్రిక్ నమోదు చేస్తారు. 10 గంటలకు నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 8239 మంది పరీక్షను రాయనున్నారు.

పటిష్ట బందోబస్తు

ఆదివారం జిల్లా వ్యాప్తంగా జరగనున్న గ్రూప్1 ప్రిలిమ్స్‌కు పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు నిర్వహిస్తుంది. ప్రతి సెంటర్ వద్ద ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలుల్లో ఉండనుంది. బందోబస్తులో అడిషనల్ డీసీపీలు 2, ఏసీపీలు 4, ఎస్‌ఐలు 14, ఏఎస్‌ఐలు 21, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు మొత్తంగా 298 మంది విధులు నిర్వహిస్తున్నారు. మూడు రూట్, మూడు ఎస్కార్ట్ పార్టీలు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షిస్తాయి.

నోడల్ అధికారిగా గరిమా అగర్వాల్

జిల్లాలో నిర్వహించనున్న గ్రూప్ ప్రిలిమినరీ పరీక్ష నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ గరిమాను నియమించారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణలో భాగంగా రూట్ ఆఫీసర్లు 3, ఫ్లైయింగ్ స్కాడ్ 5, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్ 21, చీఫ్ సూపరింటెండెంట్లు 21, ఇన్విజిలేటర్లు 392 మంది విధులు నిర్వహించనున్నారు. సిద్దిపేట రీజినల్ కోఆర్డినేటర్ వి.పి రాజు పర్యవేక్షణలో పరీక్షలు కొనసాగనున్నాయి. ఈ గ్రూప్ 1 పరీక్షలో మొత్తంగా 8239 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.



నాచగిరి వ్రత శోభితం

సుప్రసిద్ధ నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రం శనివారం వ్రత శోభతో అలరారింది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలు, ఉమ్మడి మెదక్‌జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు, అభిషేకాలు, కల్యాణాలు, సేవలతో క్షేత్రం సందడిగా మారింది. భక్తులు మొక్కులు చెల్లించుకుని, గర్భగుడిలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహస్వామివారిని దర్శించుకుని తరించారు. క్షేత్రంలో 48 వ్రతాలు, 14 అభిషేకాలు, 5 కల్యాణాలు, 20 సేవలు జరిగాయని ఆలయ సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ తెలిపారు.

వర్గల్(గజ్వేల్):

ప్రీ స్కూల్‌గా అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ కేంద్రాలను క్రమంగా పూర్వ ప్రాథమిక పాఠశాలలు (ప్రీ స్కూల్)గా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు 3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు ప్రీ ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే అందించనుంది. దీని కోసం ప్రభుత్వం జిల్లాల వారీగా అన్ని వివరాలను సేకరించింది. మొదటగా 440 అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేసి ప్రీ ప్రాథమిక విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుంది. ఈ ప్రీ స్కూల్ విద్యను జూన్ నుంచి అమలు చేయనున్నారు.

- సిద్దిపేటరూరల్

జిల్లాలోని 440 కేంద్రాలు ఎంపిక

- ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం
- నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలో విద్య
- 7,591 మంది చిన్నారులకు లబ్ధి
- మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ పూర్తి

జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,150 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా పాఠశాలల ప్రాంగణంలో అన్ని రకాల వసతులతో కొనసాగుతున్న 440 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్ విద్యకు ఎంపిక చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిలో మార్పులు చేర్పులు చేయనున్నారు. ఎంపిక కాని అంగన్‌వాడీ కేంద్రాలకు, ప్రీ ప్రైమరీ స్కూల్‌గా మారిన అంగన్‌వాడీలకు వ్యత్యాసం ఏర్పడనుంది. చిన్నారులకు ప్రశాంత వాతావరణంతో ప్రీ ప్రైమరీ విద్యను అందించనున్నారు. ఇది విజయవంతమైతే అన్ని అంగన్‌వాడీలు ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా రూపుదిద్దుకోనున్నాయి.



మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం

7,591 మంది చిన్నారులకు లబ్ధి

ప్రీ ప్రైమరీ పాఠశాలలకు ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరాలను నేర్పించనున్నారు. ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం 7,591 మంది చిన్నారులు ఉండగా వీరికి లబ్ధి చేకూరనుంది. వీరిలో 3,498 మంది బాలురు, 4,093 మంది బాలికలు ఉన్నారు. వీరితోపాటుగా ఇప్పటివరకు

జిల్లాలో అంగన్‌వాడీల వివరాలు..

మొత్తం ప్రాజెక్టులు	05
అంగన్‌వాడీలు	1,150
ప్రీ ప్రైమరీ స్కూల్‌కు ఎంపికైనవి	440
0 నుంచి 6 నెలలోపు చిన్నారులు	6,167
7 నెలల నుంచి సంవత్సరంలోపు	6,450
సంవత్సరం నుంచి 3 ఏళ్ల చిన్నారులు	25,737
3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల లోపు వారు	30,295

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషహాకారం అందించి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆట, పాటలతో విద్యాబోధన చేపడుతున్నారు.

ప్రతీ 4వ శనివారం విద్యా దినోత్సవం

ప్రీ స్కూల్‌లో భాగంగా శిక్షణ పొందిన అనంతరం అంగన్‌వాడీ టీచర్లు 3 నుంచి 6 ఏళ్ల పిల్లలకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలో బోధన చేయనున్నారు. జూన్ నుంచి ఆగస్టు వరకు ఆట పాటలు, ప్రకృతి, సైన్స్, యోగా, గణితం, రంగులు ఇతర అంశాలపై అవగాహన కల్పించనున్నారు. నెలలో 4వ శనివారం ప్రీ ప్రైమరీ విద్యా దినోత్సవం జరిపి నృత్యాలు, కార్యక్రమాలను ప్రదర్శిస్తారు. పిల్లల్లో వచ్చిన మార్పులు, అభివృద్ధిని తల్లిదండ్రులకు తెలియజేయనున్నారు.

మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ పూర్తి..

జిల్లాలో ప్రీ ప్రైమరీ విద్యను అందించనున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా నుంచి 10 మంది మాస్టర్ ట్రైనర్లకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. వీరు ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు ప్రాజెక్టు సెక్టార్‌ల వారీగా 3 రోజుల చొప్పున శిక్షణ అందించనున్నారు. ఎంపికైన 440 మంది టీచర్లకు శిక్షణ అందించి ప్రీ ప్రైమరీ విద్యకు సన్నద్ధం చేయనున్నారు. దీని కోసం ఆయా ఐసీడీఎస్ సెక్టార్ కేంద్రాల్లో శిక్షణకు ఏర్పాట్లు చేయనున్నారు.

త్వరలోనే కేంద్రాలకు పుస్తకాలు, కిట్స్..



ప్రీ స్కూల్‌లో భాగంగా శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లతో ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు శిక్షణ అందించి త్వరలో ప్రారంభిస్తాం. ఇందుకు ప్రభుత్వానికి అన్ని నివేదికలను పంపించాం. మరో రెండు మూడు రోజుల్లో సంబంధిత మెటీరియల్, కిట్స్, పుస్తకాలు, యూనిఫామ్స్ అన్ని త్వరలోనే కేంద్రాలకు సరఫరా అవుతాయి. దీని వల్ల 7,591 మంది చిన్నారులకు లబ్ధి చేకూరనుంది.

- శారద, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి

క్లుప్తంగా

వెంచర్‌లో గంజాయి మొక్కలు పెంపకం

వ్యక్తి అరెస్టు



మొక్కలు, నిందితుడితో పోలీసులు

జహీరాబాద్ టౌన్: గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణ సమీపంలో గల తిరుమల వెంచర్‌లో యజమాని ఎ.రాఘవరెడ్డి గంజాయి మొక్కలను పెంచుతున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు మెదక్ డివిజన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం శనివారం వెంచర్‌ను తనిఖీ చేయగా 12 గంజాయి మొక్కలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని ఆయన్ను అరెస్టు చేసినట్లు సీఐ వీణారెడ్డి తెలిపారు. వాటి విలువ రూ.1.20 లక్షలు ఉంటుందన్నారు. తనిఖీలో ఎస్ఐ అనిల్‌కుమార్, సిబ్బంది అలీమ్, పీ.అనిల్‌కుమార్ ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కంటైనర్

బయటపడ్డ 136 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యం





కంటైనర్ వాహనం, పట్టుబడిన బియ్యం

దుబ్బాకరూరల్: గూడ్స్ కంటైనర్ వాహనం డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్రమ రేషన్ బియ్యం బయట పడింది. ఈ ఘటన మండలంలోని మల్లికుంట గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. రాజన్న సిరిసిల్లా జిల్లా, జిల్లెల గ్రామానికి చెందిన పర్వతం నరేశ్ శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో గూడ్స్ కంటైనర్ వాహనంలో అక్రమంగా 136 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సిద్దిపేట నుంచి మెదక్ వైపు తరలిస్తున్నాడు. మల్లికుంట గ్రామ సమీపంలోకి రాగానే వాహనం డివైడర్‌ను ఢీకొట్టడంతో పక్కకు ఒరిగింది. వెంటనే వాహనం యజమాని రాజుకు ఫోన్ చేసి చెప్పడంతో మరో కంటైనర్ వాహనం తీసుకొచ్చి రేషన్ బియ్యాన్ని లోడ్ చేస్తున్నారు. సమాచారం అందుకున్న దుబ్బాక పోలీసులు డ్రైవర్, యజమానితో సహా వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శనివారం జిల్లా సివిల్ సప్లయ్ విభాగానికి చెందిన అధికారి రాజిరెడ్డికి బియ్యాన్ని పోలీసులు అప్పగించారు. ఆయన ఫిర్యాదు మేరకు వాహన డ్రైవర్ నరేశ్, వాహన యాజమాని రాజుపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఫీజలగలు!

సండే స్పెషల్

ఫీజుల పేరిట దోచుకుంటున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు

- నర్సరీకి రూ.60 వేలు వసూలు
- రవాణా పేరుతో తల్లిదండ్రులపై మోయలేని భారం
- విద్యాహక్కు చట్టానికి తూట్లు
- చితికిపోతున్న మధ్య తరగతి కుటుంబాలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 831 ప్రైవేట్ పాఠశాలలో 3,03,394 విద్యార్థులు




మరో రెండు రోజుల్లో బడి గంటలు మోగనుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఏటా ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతూ దోపిడీ చేస్తున్నాయి. అడ్మిషన్లు, యూనిఫామ్స్, పుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల జేబుకు చిల్లు పెడుతున్నారు. విద్యను వ్యాపారంగా చేసుకొని పాఠశాలలను నడిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. పిల్లలకు ఉత్తమ విద్య అందించాలనే ఆశ ఒక వైపు, అధిక ఫీజులతో మోయలేని భారం మరో వైపు తల్లిదండ్రులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

– సాక్షి, సిద్దిపేట

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇంటర్నేషనల్, టెక్నో, ఐఐటీ, ఒలంపియాడ్ అంటూ చివరన పేర్లు పెట్టి పాఠశాలలు ఎక్కువ ఫీజులు తీసుకుంటున్నాయి. ఫీజులతోపాటు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, బుక్స్‌బ్యాగ్‌లు కొన్ని ప్రైవేట్ పాఠశాలలో విక్రయిస్తున్నారు. మరికొన్ని పాఠశాలలకు అనుబంధంగా బుక్ స్టాల్స్, పాఠశాలలకు దగ్గర కౌంటర్లను ఏర్పాటు చేసి అమ్ముతున్నారు. యూనిఫామ్‌లు, క్యారేజీ బ్యాగ్, షూస్‌లు పాఠశాల వారు చెప్పిన దగ్గరనే కొనుగోలు చేయాలని నిబంధనలు పెడుతున్నారు. పాఠశాల యాజమాన్యం పుస్తకాలు విక్రయిస్తే ఎలాంటి లాభం లేకుండా విక్రయించొచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో యథేచ్ఛగా ప్రైవేట్ పాఠశాలలకు అనుబంధంగా పుస్తకాలు విక్రయిస్తున్నారు. స్కూల్ బస్సు రవాణాకు చెల్లించాల్సిన సొమ్ము అదనంగా వసూలు చేస్తున్నారు. ఇది ఓ సాధారణ ప్రైవేట్ స్కూల్‌లో మూడు జతల యూనిఫామ్స్‌కే రూ.2,500, స్పోర్ట్స్ డ్రెస్ రూ.1,000, టై, బెల్ట్, బ్యాడ్జీ కలిపి రూ.1,000 రెండు జతల షూస్‌కు రూ.1,000లు చెల్లించాల్సి వస్తోంది.

సిద్దిపేట పట్టణ శివారులో దేశ రాజధాని పేరుతో ఉండే ఓ ప్రైవేట్ పాఠశాల ఫీజు వివరాలు ఇలా ఉన్నాయి. నర్సరీకి ఏడాదికి రూ.59,400 వసూలు చేస్తున్నారు. దీనికి తోడు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1,000, అడ్మిషన్ ఫీజు రూ.15వేలు, నర్సరీకి బుక్స్, స్టూడెంట్ కిట్ రూ.15 వేలు, అలాగే బస్సుకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఒకేసారి ఫీజు మొత్తం చెల్లిస్తే 10 శాతం రాయితీ ఇస్తామని నిర్వాహకులు చెబుతున్నారు. ఇలా ఫీజులు వసూలు చేస్తున్న జిల్లా విద్యా శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.



అప్పు చేసైనా ప్రైవేట్‌లో..

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలతోపాటు ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్‌లు, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. మెరుగైన విద్యను అందిస్తుండటంతో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు డాక్టర్‌లు, ఇంజనీర్స్, వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్నారు. మరికొన్ని చోట్ల ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించక పోవడంతో తల్లితండ్రులు ప్రైవేట్ పాఠశాలకు పంపిస్తున్నారు. మారిన సామాజిక పరిస్థితుల్లో అప్పు చేసైనా తమ పిల్లలకు పేరున్న పాఠశాలలో చదివించాలని తల్లిదండ్రులు తపన పడుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయి.

ఫీజుల నియంత్రణ కరువు

ఉమ్మడి మెదక్ జిల్లాలో 831 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో ఫీజుల నియంత్రణ కొరవడింది. ప్రభుత్వం ఎన్ని జీవోలు, నిబంధనలు తీసుకొచ్చినా ప్రయోజనం లేకుండా పోతుంది.

జిల్లా	ప్రభుత్వ	విద్యార్థులు	ప్రైవేట్	విద్యార్థులు
సిద్దిపేట	980	87,500	257	1,10,000
సంగారెడ్డి	1,295	1,07,990	454	1,81,023
మెదక్	897	64,176	120	12,371

తరగతి	ప్రైవేట్ (రూ.)	కార్పొరేట్ (రూ.)
నర్సరీ	15,000	59,400
ఎల్‌కేజీ	16,000	61,200
యూకేజీ	18,000	63,000
1వ	22,000	66,600
2వ	24,000	68,400
3వ	25,000	70,200
4వ	27,000	72,000
5వ	28,000	74,700
6వ	30,000	76,500
7వ	33,000	78,300
8వ	35,000	81,200
9వ	35,000	95,000
10వ	40,000	1,10,000

ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ ఖాళీలు

జిల్లా	ఖాళీల సంఖ్య
సిద్దిపేట	664
సంగారెడ్డి	977
మెదక్	495

ఫీజులపై స్పష్టత లేకపోవడంతో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం మార్గదర్శకాలు ఇవ్వకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, పేరెంట్స్ అసోసియేషన్స్, విద్యార్థి సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

రవాణా మరింత భారం

డీజిల్ ధరలు పెరిగాయంటూ రవాణా ఫీజులను పాఠశాలలు పెంచుతున్నాయి. గతంలో 5 కిలో మీటర్ల పరిధిలో రూ.15 వేలు, 5 నుంచి 10 కిలో మీటర్లకు రూ.17వేలు, 10 కిలో మీటర్ల కంటే ఎక్కువ అయితే రూ.20 వేలు వసూలు చేశారు. దీనికి తోడు ఈసారి మరింత పెంచి వసూలు చేస్తున్నారు. పిల్లల ఫీజులకు తోడు రవాణా ఫీజుల భారంతో తల్లిదండ్రులు మరింత ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాలలో దోపిడీని అరికట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

తరగతి	నోట్‌బుక్స్, పుస్తకాలు
నర్సరీ నుంచి యూకేజీ	రూ.3,500 నుంచి రూ.4,200
1 వ	రూ.4,800
2 వ	రూ.5,200
3 నుంచి 5వ	రూ.5,800
6 నుంచి 10వ తరగతి వరకు	రూ.5,500 నుంచి రూ.7 వేలు



పట్టణంలో ఓ బుక్‌స్టాల్ వద్ద కొనుగోలు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రతీ దానికి డబ్బులే



పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపాలంటనే భయం వేస్తోంది. అడ్మిషన్, షూ బెల్టు, పుస్తకాలు, నోట్ బుక్స్, డైరీ అంటూ ప్రతీ దానికి డబ్బులే వసూలు చేస్తున్నారు. విడతల వారీగా ఫీజులు తీసుకుంటూనే ఒక్కరోజు ఆలస్యమైనా పిల్లలను తమ తోటి విద్యార్థుల ఎదుట అవమానపరిచే విధంగా క్లాసులో నిలబెడుతున్నారు. ఇది సరికాదు. ఇలాంటి పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

– చొప్పరి రవి కుమార్, సిద్దిపేట

నియంత్రణ ఉండాలి



జిల్లాలో కార్పొరేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఈ పాఠశాలల్లో ఇష్టం వచ్చిన ప్రకటనలతో విద్యార్థుల తల్లిదండ్రులను అనేక రకాల ప్రలోభాలకు గురి చేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫామ్‌లు, షూలు, టైల పేరిట అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు తమ నియంత్రణను కొనసాగించాలి. విద్యాహక్కు చట్టం అమలు చేయని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– దాసరి ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

ఎక్కువ ధరకు విక్రయించొద్దు



ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ పాఠశాలలో ఒకే ఫీజు ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తే ఎంఆర్‌పీ కంటే ఎక్కువ విక్రయించొద్దని ప్రభుత్వం ఇటీవలె ఉత్తర్వులు జారీ చేసింది. ఎక్కువ విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్ రెడ్డి, డీఈఓ, సిద్దిపేట



సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పల శ్రీనివాస్ గుప్త

పేదలకు సేవ చేయడమే లక్ష్యం

- ఐవీఎఫ్ జాతీయ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త
- జిల్లా బాధ్యుల ప్రమాణ స్వీకారోత్సవం

గజ్వేల్: పేదలకు సేవలందించడమే లక్ష్యంగా ఐవీఎఫ్ (ఆలిండియా వైశ్య ఫెడరేషన్) పని చేస్తుందని ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. శనివారం గజ్వేల్‌లో ఐవీఎఫ్ జిల్లా బాధ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా ఐవీఎఫ్ విశేషమైన సేవలను అందిస్తుందని, దేశ విదేశాల్లోనూ విస్తరింపజేయడానికి కృషి చేస్తామన్నారు. దేశంలోని పేద ఆర్య వైశ్య విద్యార్థుల చదువుల కోసమే కాకుండా, విదేశాల్లో చదువు కోసం వెళ్లే వారికి కూడా ఐవీఎఫ్ ద్వారా సహకారాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉంటూ అన్ని రంగాల్లో తమ న్యాయమైన వాటాను దక్కించుకోవడానికి ముందుకుసాగాలన్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐవీఎఫ్ జిల్లా బాధ్యులు నేతి శ్రీనివాస్‌గుప్త, ఎన్‌సీ సంతోష్ గుప్త, కాసనగట్టు స్వప్న, గజ్వేల్ శాఖ అధ్యక్షుడు కైలాస ప్రభాకర్, యువజన విభాగం అధ్యక్షుడు కొమురవెల్లి శ్రావన్ గుప్త తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఐవీఎఫ్ నూతన బాధ్యులను ఆర్య వైశ్య ప్రముఖులు అభినందించారు.

పులి ఆనవాళ్లు లేవు

అటవీ శాఖ డీఆర్‌ఓ

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూర మల్లన్న గుట్టల్లో పులి సంచరిస్తున్నట్లు వార్తలు అవాస్తమని, ఎలాంటి పుకార్లు ప్రజలు నమ్మొద్దని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ షాహినీ తెలిపారు. శనివారం మల్లన్న గుట్ట ప్రాంతాన్ని అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ షాహినీ బీట్ ఆఫీసర్ సంతోషతోపాటు సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా షాహినీ మాట్లాడుతూ.. ఎవరో కావాలనే పుకార్లు సృష్టిస్తున్నారని, పులి ఆనవాళ్లు ఎక్కడా కనిపించడం లేదన్నారు. కుక్కలు తిరిగినట్లు మాత్రమే ఉందని అధికారులు స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయబ్రాంతులకు గురి కావొద్దని సూచించారు.



గుట్ట పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

మీనం.. ఎగబడిన జనం



దుబ్బాకలో చేపల కోసం గుమిగూడిన జనం

- జిల్లాలో మృగశిర కార్తె జోరు
- మార్కెట్లో చేపలకు భలే డిమాండ్
- కొర్రమీను కిలో రూ.600 నుంచి 800 పైమాటే

దుబ్బాక: మృగశిర కార్తె ప్రవేశం రోజు చేపలు తింటే సంవత్సరమంతా ఏ రోగాలు దరి చేరవని సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ప్రజల విశ్వాసం.. దీంతో ఆ రోజు చేపలు తినేందుకు జనం ఇష్టపడుతారు. శనివారం మృగశిర కార్తె కావడంతో చేపలు కొనేందుకు జిల్లాలోని మార్కెట్‌లలో ప్రజలు బారులు తీరారు. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల, పట్టణాలతో పాటుగా మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం చేపలు కొనేందుకు ప్రజలు ఎగబడ్డారు.

జిల్లాలో చేపల ధరలు మండిపోయాయి. ప్రజలు ఎక్కువగా ఇష్టపడే కొర్రమీను ఎక్కువగా రాకపోవడంతో వచ్చిన కొద్ది చేపలను ఎక్కువ ధరకు కొన్నారు. కొర్రమీను కిలో రూ.600 నుంచి రూ.800లకు పైగా పలుకగా, సాధారణ రోజుల్లో రూ. 350 నుంచి రూ.500 వరకు దొరికేవి. బంగారు తీగలు, బొచ్చ, గురిజలు, జెల్లలులతోపాటుగా పలు రకాల చేపలను ప్రజలు ఎగబడి కొన్నారు. ఈ చేపలు కూడా మిగతా రోజుల కంటే కిలోకు రూ.100 కు పైగా ఎక్కువ పెట్టి కొనుగోలు చేశారు. జిల్లాలోని చెరువులు, కుంటల్లో సమృద్ధిగా నీరు ఉండడంతో పుష్కలంగా చేపలు ఉన్నాయి. మత్స్యకారులకు సైతం ఉపాధి లభించింది.

చెరువుల్లో పుష్కలంగా చేపలు



ఈయేడు జిల్లాలో చెరువుల్లో చేపలు బాగా పెరిగాయి. కాలం మంచిగా కావడంతో మృగశిర కార్తె రోజు చేపలు పట్టుకొచ్చి విక్రయించాం. చెరువులు నిండితేనే రైతులు, మత్స్యకారులతోపాటు అందరు బతుకుతారు. మృగశిర కార్తె రోజున చేపలు తినడం శ్రేష్టం. అందుకే ఈ రోజు చేపలకు బాగా డిమాండ్ ఉంటుంది.

– వెంకటేశ్వర్, జాతీయ మత్స్యకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రోగాలు దరి చేరవు



ప్రతీ సంవత్సరం మృగశిరకార్తె ప్రవేశం రోజు తప్పకుండా చేపలు తింటాం. మృగశిర నాడు చేపలు తింటే ఉబ్బసం, ఆయాసంతో పాటు చాలా రకాల రోగాలు దరిచేరవు. తరాల నుంచి వస్తుండడంతో మృగశిర కార్తె రోజు చేపలు తింటున్నాం. ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వచ్చింది.

–అంకం రాజేశ్వర్, దుబ్బాక

కొర్రమీను అ'ధర'హో..

మృగశిర కార్తె సందర్భంగా శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో సందడి నెలకొంది. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ మార్కెట్లలో చేపలు భారీగా రావడంతో జనం ఎగబడ్డారు. వ్యాపారులకు గిరాకీ బాగున్నా... కొనుగోలుదారులకు మాత్రం చేపల ధరలు చుక్కలు చూపించాయి. కొర్రమీను కిలో రూ. 500 నుంచి రూ.600 వరకు అమ్మడంతో వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. రవ్వ, బొచ్చ, రొయ్యలు తదితర చేపలు కిలో రూ.140 నుంచి రూ.200 వరకు ధర పలికాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట







చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి

మృగశిరకార్తె రోజు కౌడిపల్లిలో విషాదం



రామచంద్రయ్య మృతదేహం

కౌడిపల్లి(నర్సాపూర్): మృగశిర కార్తె రోజు చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన కౌడిపల్లి మండలం రాజిపేటలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి, స్థానికులు కథనం మేరకు.. మృగశిర కార్తె సందర్భంగా రాజిపేట గ్రామస్తులు స్థానిక పెద్ద చెరువులో చాపలు పెట్టేందుకు వెళ్లారు. కాగా గ్రామానికి చెందిన బాంచ రామచంద్రయ్య సైతం వారితో వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు చేపల వల కాళ్లకు చుట్టుకొని నీటమునిగి చనిపోయాడు. మృతుడి కుమారుడు బాలక్రిష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తీగ లాగితే డొంక కదిలే..

- ఒక హత్య విచారణలో మరో హత్యను చెప్పిన వైనం
- ఇద్దరు మహిళలను చంపిన నిందితుడు అరెస్ట్

పాపన్న పేట (మెదక్): ఓ హత్య కేసులో నిందితుడు చెప్పిన సాక్ష్యం ఆధారంగా మరో మహిళ హత్య మిస్టరీ వీడింది. వివరాల్లోకి వెళ్తే.. గత నెల 28న సదాశివపేటకు చెందిన బస్వరాజు ఏడుపాయల ప్రాంతంలో ఆనెల్లి అనసూయ అనే మహిళను హత్య చేశాడు. ఈ ఘటనలో అతడిని పోలీసులు అరెస్టు చేసి పోలీసులు విచారించగా తాను మరో మహిళను హత్య చేసినట్లు వెల్లడించాడు. ఈ సమాచారంతో శనివారం కోడిగుడ్ల పోచమ్మ (40) అనే మహిళ మృతదేహాన్ని ఏడుపాయల్లో గుర్తించారు. సదాశివ పేటలో నివాసం ఉంటున్న పోచమ్మ అక్కడే ఓ హోటల్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈమెకు కూతురు, ముగ్గురు కొడుకులు సంతానం. 15 రోజుల కిందట నుంచి కనిపించకుండా పోయింది. ఆమె కుటుంబీకులు సదాశివపేట పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలోనే బస్వరాజ్ ఇచ్చిన సమాచారం మేరకు పోచమ్మ మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పాపన్న పేట ఎస్సై నరేశ్ తెలిపారు.